www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 16 నవంబరు 2022

5

ఏలూరు



ఏలూరు ఆసుపత్రిలో సీనియర్ వైద్యులను నియమించండి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో సీనియర్ వైద్యులను నియమించాలని టిడిపి ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడేటి చంటి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు ప్రభుత్వాసుపత్రిని బోధనాసుపత్రిగా మార్చారని, అందువల్ల ఇక్కడ ఎప్పటి నుంచో పనిచేస్తున్న సీనియర్ వైద్యులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారని, కొత్తగా వైద్యులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదని తెలిపారు. దీనివల్ల ఆసుపత్రికి వచ్చిన రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆసుపత్రిలో సీనియర్ వైద్యులను నియమించాలని, రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యాలయ కార్యదర్శి పాలి ప్రసాద్, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు వీరంకి త్రినాధ్, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం పాల్గొన్నారు.

రాలిన ఒక తార..!

- నటశేఖర కృష్ణకు జిల్లాతో విడదీయరాని అనుబంధం
- విద్యార్థిగా, సినీ నటునిగా, రాజకీయ నేతగా సుదీర్ఘ ప్రయాణం
- శోకసంద్రంలో ఉమ్మడి పశ్చిమగోదావరి వాసులు
- ఉదయం ఆట రద్దు చేసి నివాళులర్పించిన డిస్ట్రిబ్యూటర్లు



ఒక తార నేలను వీడింది. జిల్లాతో విడదీయరాని బంధాన్ని పెనవేసుకున్న ఆ ధ్రువతార సెలవు తీసుకుంది.. సాహసం శ్వాసగా.. మొండితనం తనపేరుగా.. వైవిధ్యం, కొత్తదనం నిత్యం కోరుకునే ఆ తార కనుమరుగైంది. ఆప్యాయత, అనురాగాలతో చిన్నవారినైనా, పెద్దవారినైనా పలుకరించే ఆ సూపర్‌స్టార్ కన్నుమూత జిల్లావాసులను దుఖఃసాగరంలో ముంచింది.

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సినీ వినీలాకాశంలో తనకంటూ ప్రత్యేకతను సంపాదించుకున్న సూపర్‌స్టార్ కృష్ణకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతో విడదీయరాని అనుబంధం ఉంది. ఆయన విద్యాభ్యాసం, రాజకీయ ప్రవేశం ఇక్కడే కొనసాగగా, సినిమా రంగంలోనూ జిల్లాతో బంధాన్ని పెనవేసుకున్నారు. 1942 మే 31న గుంటూరు జిల్లా తెనాలి పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని బుర్రిపాలెం గ్రామస్తులైన ఘట్టమనేని వీరరాఘవయ్య చౌదరి, నాగరత్న దంపతుల పెద్ద కొడుకుగా కృష్ణ జన్మించారు. ఆయనిది రైతు కుటుంబం. తల్లిదండ్రులు పెట్టిన పేరు శివరామకృష్ణమూర్తి సినిమాల్లోకి వచ్చినప్పుడు ఆదుర్తి సుబ్బారావు ఈ పేరును కృష్ణగా కుదించారు. చిన్నతనం నుంచి ఆయనకు ఎన్.టి.రామారావు అభిమాన నటుడు, పాతాళ భైరవి అభిమాన చిత్రం. కృష్ణను ఇంజనీరును చేయాలనే కోరిక తల్లిదండ్రులకు ఉండేది. అందుకోసం ఇంటర్మీడియట్‌లో ఎంపిసి సీటు కోసం ప్రయత్నించగా గుంటూరు కళాశాలలో దొరకకపోవడంతో పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో ఎంపిసి గ్రూపుతో ఇంటర్‌లో చేరారు. అక్కడ మూడు నెలలే చదివి ఏలూరులోని సిఆర్.రెడ్డి కళాశాలకు మారారు. అక్కడే ఇంటర్ పూర్తి చేసి తర్వాత బిఎస్‌సి కూడా చదివాడు. సిఆర్.రెడ్డి కళాశాలలో కృష్ణ, సినీ నటుడు మురళీమోహన్ క్లాస్‌మేట్లు. ఇద్దరూ మంచి స్నేహితులు. కృష్ణ ఏలూరులో డిగ్రీ చదువుతుండగా ఏలూరులో ప్రఖ్యాత నటుడు అక్కినేని నాగేశ్వరరావుకు ఘనంగా పౌర సన్మానం నిర్వహించారు. ఆ కార్యక్రమానికి కృష్ణ హాజరయ్యారు. నాగేశ్వరరావు ఆ స్థాయిలో ప్రజాభిమానం పొందగలడం చూసి ఆయన నటుడు కావడం వల్లే ఇంతటి గుర్తింపు వస్తుందని అర్థం చేసుకుని సినీ నటుడు కావాలనే అభిలాషను పెంపొందించుకున్నాడు. ఆయన డిగ్రీ పూర్తి చేశాక ఇంజినీరింగ్ కోసం ప్రయత్నించాడు. అయితే కృష్ణకు సీటు రాలేదు. దీంతో కృష్ణ విద్యార్థి జీవితానికి స్వస్థి పలికి మద్రాసు చేరుకున్నాడు. అక్కడ సినీరంగంలో ప్రవేశించాడు.

ఏలూరు నుంచే రాజకీయ రంగ ప్రవేశం

1989లో కృష్ణ కాంగ్రెస్ తరపున ఏలూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అయితే 1991 ఎన్నికల్లో కృష్ణ గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం కోరుకున్నా తిరిగి ఏలూరులోనే పార్టీ పోటీ చేయించింది. ఆ ఎన్నికల్లో 31 వేల ఓట్ల తేడాతో ప్రత్యర్థి బోళ్ల బులిరామయ్య చేతిలో కృష్ణ ఓటమి పాలయ్యారు. 1991లో తనకు సన్నిహితుడు, రాజకీయాల్లో తనను ప్రోత్సహించిన కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దారుణ హత్యకు గురికావడం, తాను కోరిన గుంటూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇవ్వకపోవడం, ఏలూరులో ఓటమి చెందడం వంటి కారణాలతో కృష్ణ ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు. 2009 ఎన్నికల్లో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి కోరిక మేరకు కాంగ్రెస్ పార్టీకి కృష్ణ కుటుంబం నైతిక మద్దతు అందించింది. ఏలూరు మినీబైపాస్ రోడ్డు మంజూరు విషయంలో ఎంపీగా కృష్ణ చూపిన చొరవ మరువలేనిది. సినీనటుడు కృష్ణ మృతికి సంతాప సూచకంగా మంగళవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఉదయం ఆటను రద్దు చేశారు.



సర్క్యులర్ కాపీలను దహనం చేస్తున్న నాయకులు

నూతన అటవీ విధానంతో ఆదివాసీలకు ముప్పు


ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యాన సర్క్యులర్ దహనం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నూతన అటవీ విధానం అమలు చేస్తే ఆదివాసీలకు తీరని నష్టం కలుగుతుందని, తక్షణమే ఆ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం సంఘం ఆధ్వర్యాన కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నూతన అటవీ విధానం సర్క్యులర్‌ను దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, జిల్లా కార్యదర్శి ధర్మాల రమేష్ మాట్లాడుతూ

తాతల కాలం నుంచి అడవినే నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీలు పాలకుల విధానాలతో అడవులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వం 2006 అటవీ హక్కుల చట్టాన్ని నీరుగార్చుతూ నూతన అటవీ విధానం తీసుకొచ్చిందని విమర్శించారు. పోడు భూములు సాగు చేస్తున్న గిరిజనులకు హక్కు పట్టాలు ఇవ్వాలని అటవీ హక్కుల చట్టం స్పష్టంగా చెబుతుందన్నారు. నూతన అటవీ విధానంతో ఆదివాసీలు అడవుల నుంచే కాకుండా తమ సాంప్రదాయ హక్కులను కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములను ప్రయివేట్ వ్యక్తులకు కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం కుయుక్తులు పన్నుతుందని విమర్శించారు. వన్యప్రాణి సంరక్షణ కేంద్రం, రిజర్వాయర్ నిర్మాణం, ఖనిజ సంపద పేరుతో గిరిజనులను అడవుల నుంచి దూరం చేస్తున్నారన్నారు. పోడు పట్టాల్లేని భూములను వెనక్కి తీసుకోవాలని, గతంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. అటవీ హక్కు చట్టం వచ్చి నేటికీ 16 ఏళ్లు గడుస్తున్నా పూర్తిస్థాయిలో పోడు భూములను సాగు చేస్తున్న వారికీ పట్టాలివ్వడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. దేశంలో 11 కోట్ల మంది గిరిజన తెగలకు భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కులు అమలు కాకుండా అడ్డంకులు కల్పిస్తుందన్నారు. 5, 6వ షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజనులు తమ సంప్రదాయపు భూములైన అడవుల నుండి గెంటి వేయబడుతున్నారన్నారు. ముఖ్యంగా పీసా, అటవీ హక్కుల చట్టం, న్యాయమైన పారదర్శక పరిహారం, పునరావాసం పొందే హక్కుల చట్టం (ఎల్ఎఎఆర్)లో పేర్కొన్న గిరిజన గ్రామసభ నిర్ణయం ఉల్లంఘించబడుతోందన్నారు. కార్యక్రమంలో ఎపి గిరిజన సంఘం జిల్లా నేతలు పోలోజు నాగేశ్వరరావు, చంద్రు బుల్లెమ్మ, తెల్లం దుర్గారావు, కారం భాస్కర్, ఎస్.ఏసు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు తామా ముత్యాలమ్మ, సిఐటియు జిల్లా నాయకులు ఆర్.లింగరాజు, మొడియం నాగమణి, ఎ.శ్యామలారాణి, ఎం.దుర్గారావు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: ఆదివాసి ప్రతిఘటనా పోరాటాన్ని తక్కువ అంచనా వేయొద్దని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మాల సురేష్ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అటవీ హక్కుల చట్ట సవరణను వ్యతిరేకిస్తూ చట్ట సవరణ ప్రతులను మంగళవారం దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తగరం బాబూరావు, గోవిందరాజు, అలివేరు సర్పంచి కారం అరుణ, కొర్సవారిగూడెం సర్పంచి గంగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంతెన సీతారాం

వ్య.కా.స రాష్ట్ర మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వచ్చేనెల 8, 9 ,10 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో నిర్వహించే ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర మాజీ నాయకులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీతారాం మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు భూ పోరాటాలు చేసి పేద ప్రజలకు వెలాది ఎకరాల భూమి ఇచ్చిన ఘనత వ్యవసాయ కార్మిక సంఘానికి దక్కుతుందని గుర్తు చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో భూమి పంచాలని కూలి పెంచాలని, ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని పోరాటాలు నిర్వహించామన్నారు. ఏజెన్సీ పోరాటాల గడ్డ జంగారెడ్డిగూడెంలో నిర్వహించటం పోరాటాలకు నాంది అని పేర్కొన్నారు. ఎనిమిదో తేదీన జరిగే బహిరంగ సభకు గిరిజన మైనార్టీ జాతీయ నాయకురాలు బృందాకారత్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. పేదలకు భూమి పంచితేనే రాష్ట్రం అభివృద్ధి అవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ప్రసాద్, ఆర్.లింగరాజు, పల్లెం కిషోర్, జి.రాజు, టి.నాగమణి, పిల్లి రామకృష్ణ, ఎం.జీవరత్నం, పి.మంగరాజు పాల్గొన్నారు.

ప్రమోషన్లు కల్పించాలని వినతి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లు (మహిళ) ఎఎన్ఎంలకు సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు కల్పించాలని ఎపి ప్రగతిశీల మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్స్ (ఫిమేల్) అసోసియేషన్ (ఐఎఫ్‌టియు) జిల్లా అధ్యక్షులు కె.శిశేల్యమ్మ కోరారు. సీనియర్ ఎఎన్ఎంలకు ప్రమోషన్లు ఇవ్వాలని, హెచ్ఎంఎస్‌సిఎస్ఎస్, టివిఎం, ఎంసిహెచ్ తదితర రిపోర్టులను తాము పంపిస్తుండగా సచివాలయ ఎఎన్ఎంలు వేసినట్లు ఆన్‌లైన్‌లో చూపించడం సరికాదన్నారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం డిఎంహెచ్ఒ డాక్టర్ బి.రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శిశేల్యమ్మ, సెక్రటరీ యు.ప్రమీళ మాట్లాడుతూ 25 ఏళ్లుగా చేస్తున్న సీనియర్ ఎఎన్ఎంలకు ప్రమోషన్లు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియారిటీ ప్రకారం ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన డిఎంహెచ్ఒ రవి మాట్లాడుతూ తన పరిధిలో ఉన్న న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామని, మిగతావి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ న్యాయ సలహాదారు యు.ఏసుబాబు, గౌరవాధ్యక్షులు కెవి.రమణ, కమిటీ సభ్యులు ఎ.ఆగ్నేసు, ఎన్.రాణి, ఎం.బేబీసరోజని, విజయలక్ష్మి, ఉదయలక్ష్మి పాల్గొన్నారు

పేదలకు భూములు దక్కే వరకూ పోరాటం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పేదలకు భూమి దక్కే వరకూ సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. 25 ఏళ్ళుగా మండలంలోని పేరంపేటలో ఉన్న 19.56 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్న పేదలకు పట్టలివ్వాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద మంగళవారం సిపిఐ మండల కార్యదర్శి రమణ రాజు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సిపిఐ మండల కమిటీ సభ్యులు చిట్టూరి వెంకటేశ్వరరావు, తాళ్లూరి నాగరాజు, కలపాల శ్రీరాములు పాల్గొన్నారు.

రూ.2.36 కోట్లతో నాడు- నేడు పనులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


రూ.2.36 కోట్ల నాడు - నేడు నిధులతో స్థానిక జెడ్‌పిహెచ్ బాలుర పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ఎలిజా అన్నారు. మంగళవారం స్థానిక జెడ్‌పిహెచ్ బాలుర పాఠశాలలో 18 అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ కంచర్ల వాసవి రత్నం, మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్, పట్టణ అధ్యక్షులు చంద్రరావు, జెడ్‌పిటిసి సభ్యులు పొల్నాటి బాబ్జీ, 20వ వార్డు కౌన్సిలర్ కటారి వాసు, కో ఆప్షన్ సభ్యులు వెంపా ఐజాక్ , ఎంఇఒ బి.రాముడు, హై స్కూల్ హెడ్ మాస్టర్ జగ్గారావు, మున్సిపల్ ఎఇ పి.సంధ్యారాణి, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించొద్దు

ఎపి రైతుసంఘం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగిస్తే ప్రతిఘటిస్తామని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం స్థానికంగా ఆ సంఘం ఆధ్వర్యంలో రైతాంగ సమస్యలపై సదస్సు సంఘం మండల అధ్యక్షులు దాసరి జానకిరామరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. పలు రైతాంగ సమస్యలపై చర్చించి తీర్మానాలను ఆమోదించారు. ముఖ్యఅతిథి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల కారణంగా నేడు వ్యవసాయం సంక్షోభంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ నష్టాలతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాన్ని సర్వనాశనం చేసేందుకు మూడు వ్యవసాయ నల్ల చట్టాలు తీసుకువచ్చి రైతుల పోరాటంతో రద్దు చేసిందన్నారు. ప్రస్తుతం కేంద్ర విద్యుత్ సవరణ బిల్లును తీసుకొచ్చి వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించేందుకు కుట్రలు చేస్తోందని, అందుకు రాష్ట్రంలోనే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మీటర్లు బిగించే ప్రక్రియను చేపట్టిందని విమర్శించారు. ఎక్కడైనా వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగిస్తే రైతులంతా ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. గిరిజన సంఘం జిల్లా నాయకులు తెల్లం దుర్గారావు, రైతుసంఘం మండల కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య మాట్లాడుతూ భూసేకరణ పేరుతో రైతుల భూములను బలవంతంగా లాక్కోవడం దుర్మార్గమన్నారు. ఆయిల్ పామ్ టన్ను గెలలకు రూ.20 వేలు ధర ఇవ్వాలని కోరారు.



ఆందోళన చేస్తున్న నాయకులు, రైతులు

రైతుసంఘం జెండావిష్కరణలు

డిసెంబర్ 13 నుండి 16 వరకు కేరళలోని త్రిసూర్‌లో అఖిల భారత కిసాన్ సభ జాతీయ మహాసభలు జరగనున్న సందర్భంగా జీలుగుమిల్లి, పాములవారిగూడెం, పూచికపాడు, జగన్నాధపురం గ్రామాల్లో రైతుసంఘం జెండాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బిక్కిన వీరసత్యం, సింహాద్రి శ్రీనివాసరావు, టి.సూర్యారావు, సుంకవల్లి శేషగిరి, వీరంకి నరేష్, వెలమాటి నరసింహారావు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం : డిఎన్ఆర్

ప్రజాశక్తి - ముదినేపల్లి

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని వైవాకలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, పార్టీ మండల అధ్యక్షులు మోట్రు ఏసుబాబు, వైస్ ఎంపిపిలు సునీత, రాధా, గ్రామ సర్పంచి నున్న పద్మావతి, ఎంపిటిసి బోయిన నాగరాజు, పిఎసిఎస్ అధ్యక్షులు పైడిపాటి వెంకటరమణ, డైరెక్టర్లు నున్న రంగారావు, లేళ్ల వీరవెంకట్రావు, నాయకులు బొర్రా శేషుబాబు, గంటా కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, రాచూరి కుమార్, సాయి, బేతపూడి రమణ, సతీష్, కె.ప్రవీణ్, దాసరి మధుబాబు పాల్గొన్నారు.




పథకాలు వివరిస్తున్న డిఎన్ఆర్

చింతలపూడి : ప్రజా సమస్యలక పరిష్కారానికే 'గడప-గడపకూ మన ప్రభుత్వం' నిర్వహిస్తున్నామని ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. పట్టణంలో సంచివాలయం-5 పరిధిలో గడప-గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు కె.నాగు, ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.నీరజాసుధాకర్, వెంపా కృష్ణ పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల స్థలం పరిశీలన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఇళ్ల స్థలాల మంజూరు కోసం భూ సేకరణలో భాగంగా మంగళవారం రాజవరంలో భూమిని జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు పరిశీలించారు. స్థలం కోసం దరఖాస్తు చేసిన వ్యక్తి అర్హుడని తేలితే 90 రోజుల్లోగా ఇంటి స్థలం అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సంబంధిత అధికారులు పనిచేయాలన్నారు. ఇందులో భాగంగా రాజవరంలో 83 మందికి గతంలో ఇళ్ల పట్టాలు అందించగా ప్రస్తుతం మరో 13 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఇళ్ల స్థలాలు అందించేందుకు రాజవరంలో గుర్తించిన 27 సెంట్ల భూమిని జెసి పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దారు పి.నాగమణి, వైసిపి ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, ఆర్ఐ మని దివ్య పాల్గొన్నారు.




స్థలం పరిశీలిస్తున్న జెసి

పొగాకు పంటలో శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పొగాకు పంటలో శాస్త్రవేత్తలు సూచించిన నూతన వంగడాలనే సాగు చేయాలని కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్ రైతులకు సూచించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మంగళవారం జీలుగుమిల్లి సిటిఆర్ఐను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిటిఆర్ఐను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, వై.సుబ్బయ్య, అసిస్టెంట్ ఫామ్ మేనేజర్ రమేష్, ఎంవి.జయకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న నాయకులు

క్షౌరవృత్తిలోకి రిలయన్స్‌ను అనుమతించొద్దు

నాయీ బ్రాహ్మణుల ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

క్షౌరవృత్తిలోకి రిలయన్స్ సంస్థను అనుమతించొద్దంటూ పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఫైర్‌స్టేషన్ సెంటర్ నుండి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణ సంఘం జెఎసి అధ్యక్షులు తాడికొండ నరసింహారావు మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థ అయిన రిలయన్స్ క్షౌర వృత్తిలోకి రావడం బాధాకరమని, దీన్నిరాష్ట్ర ప్రభుత్వమే అడ్డుకోవాలని కోరారు. తరతరాల నుంచి గ్రామాల నుంచి పట్టణ స్థాయి వరకు క్షౌర వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్నామని, కార్పొరేట్ ముసుగులో కడుపు కొట్టడానికి రిలయన్స్ సంస్థ ప్రయత్నిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నాయీ బ్రాహ్మణ రాష్ట్ర అధ్యక్షులు ద్రాక్షవరపు సూరిబాబు మాట్లాడుతూ కులవృత్తిపై ఆధారపడి రాష్ట్రంలో కొన్ని లక్షల కుటుంబాలు ఉన్నాయని, వారు జీవనోపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రిలయన్స్‌ను తెలుగు రాష్ట్రాల్లో ప్రవేశించకుండా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పరిటాల వీరాస్వామి, ఉపాధ్యక్షులు కిన్జంగి రాజు, వడ్డేపల్లి కిషోర్‌చంద్ర, నందీశ్వరరావు, వేల్పుకొండ వీరభద్రరావు, కార్మికులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజానికి ప్లాస్టిక్‌ను నిరోధించాలి

ఏలూరు నగర కమిషనర్ షేక్ షాహిద్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

సమాజంలో హానికర ప్లాస్టిక్ వస్తువులను నిషేధించి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ భాగస్వాములవ్వుదామని కమిషనర్ షేక్ షాహిద్ తెలిపారు. స్థానిక సిఆర్ఆర్ కళాశాల ఆడిటోరియంలో హానికర ప్లాస్టిక్ దుష్ప్రభావాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కమిషనర్ షాహిద్ మాట్లాడుతూ నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు, ప్రత్యామ్నాయ వస్తువుల వాడకంపై ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిరంతరాయంగా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజారోగ్య, పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య రహిత నగర అభివృద్ధికి నగరపాలక సంస్థ, గ్రామదీప్ స్వచ్ఛంద సంస్థ కలిసి పనిచేస్తున్నాయన్నారు. వ్యాపార, వాణిజ్య, హోటల్స్, వర్తక సంఘ వ్యాపారులు నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు, ప్లాస్టిక్ సంచుల స్థానంలో ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. పేపర్, క్లాత్, జ్యూట్ వస్తువుల వినియోగం, వాడకంపై తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. క్యారీ బ్యాగులు హానికర ప్లాస్టిక్ వస్తువులను కాలువల్లో పడేయడం ద్వారా మైక్రో ప్లాస్టిక్ తయారై ఇటు జీవరాసులు అటు మానవులపై ప్రభావం ఏర్పడి అనారోగ్య పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. నిషేధిత ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల నీటి, వాయు కాలుష్యం ఏర్పడి థైరాయిడ్, గ్యాస్ కేన్సర్ వంటి పలు రకాల వ్యాధులు వ్యాపిస్తున్నాయన్నారు. ఇంటి వద్ద చెత్తను వేరు చేసేందుకు ప్రతి ఇంటికి మూడు రకాల డబ్బాలను అందించామన్నారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల వాడకంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ప్రత్యామ్నాయ వస్తువులను వాడుకలోకి తెచ్చుకోవాలన్నారు. ముఖ్యంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనల ప్రకారం ఎన్‌జిటి ఆదేశాల ప్రకారం కాలుష్య రహిత నగరాభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత తీసుకోవాలని కమిషనర్ షాహిద్ పేర్కొన్నారు. అనంతరం నిషేధిత ప్లాస్టిక్ వాడుబోమని వ్యాపారులు, విద్యార్థులు, వినియోగదారులు, ఉపాధ్యాయులు, అధికారులతో కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ అపూర్వ భరత్, ప్లాస్టిక్ నియంత్రణ అధికారి సిరాజ్, గ్రామదీప్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ మనోహరి, కార్పొరేషన్ హెల్త్ అధికారి గోపాల్ నాయక్, కళాశాల ప్రిన్సిపల్ అరుణ కుమారి, డాక్టర్ అచ్యుతరావు, డాక్టర్ ఎల్‌వివిఎస్.ప్రసాద్, వ్యాపార వర్తకసంఘ ప్రతినిధులు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ షేక్ షాహిద్

'సామాజిక కార్యక్రమాలు అభినందనీయం'

ఆగిరిపల్లి:సుశిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని చక్కపల్లి ఫౌండేషన్ ట్రస్టు కార్యదర్శి, చక్కపల్లి విద్యాసంస్థల అధినేత చక్కపల్లి సుధ అన్నారు. ఆడపిల్లలందరికి సుశిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకుఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని ఆగిరిపల్లి ఎంపిడిఒ డి.సుహాసినితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ కుట్టుశిక్షణ ద్వారా 40 మంది మహిళలకు ఉపాధి చేయూత పథకం ద్వారా ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సుశిక్షణ ఫౌండేషన్ అధ్యక్షురాలు చిగురుపాటి విమల, సభ్యులు ఎస్.రాస్ని, వలీ, ఖాదర్, గ్రామ ప్రముఖులు రాజు పాల్గొన్నారు.

కుష్టు నివారణకు కృషి చేయాలి

గణపవరం:కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిప్పర పిహెచ్‌సి వైద్యులు కె.ప్రియాంక అన్నారు. మంగళవారం పలుగ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 15 నుండి వచ్చేనెల 2వ తేదీ వరకూ గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కుష్టు వ్యాధి మైకో బ్యాక్టీరియం లెప్రి అనే బ్యాక్టీరియా ద్వారా వస్తుందని, వ్యాధి బయటపడడానికి ఒక్కోసారి ఏడేళ్ల సమయం పడుతుందని తెలిపారు. గ్రామాల్లో ఎవరికైనా శరీరంపై రాగి రంగు మచ్చలు, స్పర్శ లేకపోవడం చేతులు తిమ్మిర్లుగా ఉండడం, అలాగే కండరాల బలహీనత, కాళ్లకు పుండ్లు వంటి లక్షణాలుంటే వెంటనే ప్రభుత్వాసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ విజిటర్ పి.లీలావతి, సుబ్బలక్ష్మి, ఆరోగ్య సహాయకులు నామాల రాజు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

షెడ్డు తొలగింపు అన్యాయం

ఏలూరు అర్బన్:స్థానిక అశోక్‌నగర్ శ్మశాన వాటికలో పదేళ్లుగా ఫ్లాష్ స్వచ్ఛంద సంస్థ నిర్మించిన షెడ్డుని మున్సిపల్ అధికారులు అక్రమంగా తొలగిస్తున్నారు. దీనికి అడ్డుపడిన ఏలూరు జనసేన పార్టీ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడిని, ప్రధాన కార్యదర్శి ఎస్.రాజేష్‌ని అరెస్టు చేసి టూటౌన్ పోలీస్ స్టేషన్‌కి తరలించారు. విషయం తెలుసుకున్న జనసైనికులు భారీ ఎత్తున పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఆందోళన చేశారు. అనంతరం 41 సిఆర్‌పిసి నోటీసు ఇచ్చి సంతకం పెట్టించుకుని రెడ్డి అప్పల నాయుడుని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏలూరులో దుర్మార్గమైన పాలన నడుస్తుందని మండిపడ్డారు. ఫ్లాష్ స్వచ్ఛంద సంస్థ పేరు మీద అంతిమయాత్రకు, శాంతియాత్రకు వాహనాన్ని ప్రమోట్ చేస్తున్న షెడ్డు తొలగింపును అడ్డుకుంటే అరెస్టు చేశారన్నారు. మృతదేహాలను బంధువులు కూడా తీసుకెళ్లని పరిస్థితుల్లో ఫ్లాష్ సంస్థ వారు దగ్గరుండి తీసుకెళ్లి ఎవరైనా అనాధలుంటే వారికి ఉచితంగా దహన సంస్కారాలు చేయడం చేస్తున్నారని, అలాంటి వాటిని తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

ఆదివాసీల హక్కులను కాపాడాలి

జీలుగుమిల్లి:ఆదివాసీలను అడవుల నుండి గెంటివేసే అటవీ హక్కుల చట్టం 2022ను సత్వరం విరమించుకోవాలని అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షులు వెట్టి సుబ్బన్న అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చ ఇచ్చిన పిలుపులో భాగంగా అఖిల భారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని దిబ్బగూడెం, తాటిరామన్నగూడెం, జిల్లేళ్లగూడెం, కామయ్యపాలెం గ్రామాల్లో అటవీహక్కుల చట్టం 2022 ప్రతులను, దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులను, అటవీ సంపదను, భూ ఖనిజ సంపదను, కొండలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి అడవుల నుండి ఆదివాసీలను గెంటేందుకు బిజెపి పూనుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.గంగరాజు, భీమరాజు, నాగేశ్వరరావు, ముత్తమ్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.

నిర్వాసితుల ఇళ్లు నాణ్యంగా ఉండాలి

జీలుగుమిల్లి:మండలంలోని యర్రవరం, వంకవారిగూడెం నిర్వాసిత కాలనీలను మంగళవారం హౌసింగ్ పీడీ టి.వేణుగోపాల్ సందర్శించారు. నిర్వాసిత కాలనీల్లోని ప్రభుత్వ భవనాలను, డ్రెయినేజీ నిర్మాణాలను పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో, త్వరితగతిన పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎఇ వర్మ, బసిరెడ్డి వంశీ పాల్గొన్నారు.

'కాపుల కోసం పనిచేసే పార్టీకే మద్దతు'

కొయ్యలగూడెం:వచ్చే ఎన్నికల్లో కాపుల అభివృద్ధికి పాటుపడే రాజకీయ పార్టీకి అధికారం కట్టబెట్టేలా సంఘటితంగా కృషి చేయాలని పట్టణ కాపు సంఘం అధ్యక్షులు దుగ్గిన శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కొయ్యలగూడెంలోని కాపు సంఘం టౌన్ ప్రెసిడెంట్ దుగ్గిన శ్రీనివాస్ నివాసంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాపు ప్రముఖులు ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు సంకు మధుని పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపులకు మరిన్ని సంక్షేమ పథకాలను ప్రభుత్వం కల్పించాలని, కాపు విద్యార్థులకు ఉపకారవేతనాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురళీకృష్ణ, మేకల అన్నవరం, మేకల నాగేంద్రప్రసాద్, సుబ్రహ్మణ్యం, రాము పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన పలువురు నేతలు

ఉంగుటూరు : టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ను కైకరం సర్పంచి సనగల గోపి, ఇతర నాయకులు మంగళవారం ఉండవల్లిలో కలిశారు. పార్టీ బలోపేతానికి తాము తీసుకుంటున్న చర్యలపై వివరించామని గోపి చెప్పారు. 2023 జనవరి నుంచి ప్రారంభయ్యే టిడిపి పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు యాళ్ల సుజీవరావు, జిల్లా కార్యదర్శి సిరిబత్తిన కృష్ణమోహన్, నాయకులు కరణం చంద్రకుమార్, నాగేంద్రసింగ్, నాని, ఫణీంద్ర, పాల్గొన్నారు.

కొయ్యలగూడెం:వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయానికి కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షులు జేష్ఠ రామకృష్ణ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం మండల మాజీ ప్రధానకార్యదర్శి రాచూరి మదన్ ఇరువురూ లోకేష్‌ను విజయవాడలోని ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిస్థితిపై లోకేష్ ఆరా తీశారని, ఇందుకు తగిన సమాచారంతోపాటు పోలవరం ప్రాజెక్టు అప్‌డేట్ వివరించామని తెలిపారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

చాట్రాయి:సహకార సంఘ 69వ వార్షికోత్సవం మంగళవారం బూరుగుగూడెంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపి స్టేట్ కో ఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ తనపై నమ్మకంతో అప్పగించిన ఛైర్మన్ పదవిని అందరి సహకారంతో బాధ్యతగా నిర్వర్తిస్తానన్నారు. మాజీ సమితి అధ్యక్షులు గడ్డం సత్యనారాయణ రెడ్డి అడుగుజాడలలో నడుస్తూ సేవలందిస్తానని చెప్పారు. అనంతరం రాఘవరెడ్డిని ఘనంగా సన్మానించారు. కెడిసిసి బ్యాంకు మేనేజర్ ప్రభాకర్ పూలమాలతో సత్కరించారు. అనంతరం మాజీ సమితి అధ్యక్షులు గడ్డం సత్యనారాయణ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మోరంపూడి నాగేశ్వరరావు, పుచ్చకాయల సుబ్బారెడ్డి, పరస చెన్నారావు, దామెర బుచ్చిబాబు, మాదల నరసింహారావు, బాబ్జీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు 16న ఎంపీ కోటగిరి శంకుస్థాపన

ఉంగుటూరు :మండలంలో రూ.1.20 కోట్లతో పలు అభివృద్ధి పనులను ఈనెల 16వ తేదీన ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ప్రారంభిస్తారని వైసిపి మండల కన్వీనర్ మరడ మంగారావు తెలిపారు. గోపాలపురంలో రూ.40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.22 లక్షలతో చేపట్టిన రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. ఆనంతరం రామచంద్రాపురంలో రూ.18 లక్షలతో నిర్మించిన వైఎఆస్‌ఆర్ ఆరోగ్య కేంద్రాన్ని, యర్రమిల్లిపాడులో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.

విద్యుత్ తీగ తెగిపడి ఎద్దు మృతి

బుట్టాయగూడెం:లక్ష్మడుగూడెం పంచాయతీ పరిధిలోని కొమ్ముగూడెంలో రైతుకలగర నానికి చెందిన పొలంలో దుక్కుతున్న ఎద్దుపై 11కెవి కరెంట్ తీగలు తెగి పడడంతో అక్కడికక్కడే చనిపోయింది. ఈ సంఘటనలో నాగలి దున్నుతున్న రైతు పిచ్చుకల వెంకటేష్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. ఎఇ శ్రీనివాస వర్మ, ఎల్‌ఐ రవి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కుంగ్‌ఫూలో జంగారెడ్డిగూడెం విద్యార్థుల ప్రతిభ

జంగారెడ్డిగూడెం:ఇటీవల తణుకులో నిర్వహించిన కుంగ్‌ఫూ కరాటేలో జంగారెడ్డిగూడెం నుండి ఏడుగురు విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారని కుంగ్‌ఫూ మాస్టర్ గంధం సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను మంగళవారం స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ అర్.వరలక్ష్మి అభినందించారు. ఈ సందర్భంగా కుంగ్‌ఫూ మాస్టర్ సురేష్ మాట్లాడారు.

కృష్ణ మరణం సినీ ప్రపంచానికి తీరని లోటు: ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ఏలూరు:ప్రముఖ సినీ నటుడు కృష్ణ మృతి బాధాకరమని ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు సినిమా రంగానికి ఆయన చేసిన సేవ ఎనలేనిదని, రాజకీయాల్లో కూడా రాణించారని పేర్కొన్నారు. కృష్ణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఏలూరు అర్బన్:సినీ హీరో కృష్ణ మృతి పట్ల కేంద్ర ప్రభుత్వ పారిశ్రామిక మండలి మాజీ సభ్యులు పులి శ్రీరాములు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. 1989లో ఏలూరు ఎంపీగా కృష్ణ ఉన్నప్పుడు తాను జిల్లా యువజన కాంగ్రెస్ ప్రచారవిభాగం ఛైర్మన్‌గా ఉండేవాడినని గుర్తు చేశారు. మంచికి మానవ త్వానికి మారుపేరుగా ఉండేవారని, సినీ రంగంలో తెలుగు ప్రేక్షకులకు నూతనత్వాన్ని, తొలి ఈస్ట్‌మన్ కలర్, తొలి సినిమా స్కోప్, తొలి 70 ఎంఎం, తొలి కౌబాయ్ చిత్రాలను అందించిన ఘనత హీరో కృష్ణ కే దక్కుతుందని పేర్కొన్నారు. ఆయన మరణం తెలుగు ప్రేక్షకులకు తీరనిలోటన్నారు.

కృష్ణ మృతికి స్థానిక సత్యనారాయణ థియేటర్ ప్రాంగణంలో సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కవులూరి నాని, సైమన్, గుత్తా కాశీ, స్టేట్ మెడికల్ బోర్డ్ సభ్యులు దిరిసాల వరప్రసాద్, వైసిపి నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మేతర సురేష్, మణికంఠ, కందిపట్ల నాని పాల్గొన్నారు.

ఏలూరు:సూపర్‌స్టార్ కృష్ణ మృతికి సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ తరపున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. కృష్ణ తెలుగు సినీరంగంలో అగ్ర కథానాయకులుగా వెలుగొందారని, చిత్రరంగంలో అనేక నూతన ప్రయోగాలు చేశారని, సినీ నటుడిగా, నిర్మాతగా, దర్శకునిగా, స్టూడియో అధినేతగా వివిధ రూపాల్లో తెలుగు సినిమా పరిశ్రమలో సేవలందించారని కొనియాడారు. 1989లో ఏలూరు పార్లమెంట్ స్థానానికి పోటీ చేసి ఎంపీగా గెలిచారన్నారు. మృతికి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు.

జంగారెడ్డిగూడెం : కృష్ణ మృతి బాధాకరమని ఆయన అభిమానులు అవేదన వ్యక్తం చేశారు. నూతన మున్సిపల్ కార్యాలయం వద్ద సంతాప సభ నిర్వహించారు. ఈ సభలో అభిమానులు దత్తు, పిపిఎన్.చంద్రరావు, కేమిశెట్టి మల్లిబాబు, ముస్తఫా పాల్గొన్నారు.

గుండెపోటుతో వైసిపి నేత మృతి

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రముఖ వైసిపి నేత కోండ్రు కిషోర్ గుండెపోటుతో(55) మంగళవారం మృతిచెందారు. పార్టీలో కీలక వ్యక్తిగా ఆయన పనిచేస్తున్నారు. సర్పంచి ఎన్నికల్లో తన భార్య వజ్రకిషోర్ గెలుపులోనూ కీలపాత్ర పోషించారు. ప్రపంచదేశాల్లో 10 దేశాలు తిరిగి, ఐదు భాషలు అనర్గళంగా మాట్లాడగలిగే నేర్పు ఉంది. ప్రముఖ విద్యావేత్తగా మండలంలో పేర్గాంచారు. గ్రామంలో యువతకు ప్రతీ సంవత్సరం క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహిస్తూ, వారిని ప్రోత్సహిస్తారని, ఆయన మరణం తీరనిలోటని వైసిపి నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మండల గ్రంథాలయ ఛైర్మన్ మిర్యాల దిలీప్ సంతాపం తెలిపారు.కిషోర్ మృతి బాధాకరమని, వైసిపికి తీరని లోటు అని ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు.

ఇష్టానుసారంగా ఇళ్లు కూల్చేస్తే సహించేది లేదు

రోడ్డు విస్తరణ పనులపై ముదినేపల్లి గ్రామస్తుల ఆగ్రహం

ప్రజాశక్తి - ముదినేపల్లి

తమకు ప్రత్యామ్నాయం చూపి రోడ్డు విస్తరణ పనులు చేసుకోవాలే తప్ప, ఇష్టానుసారంగా కొలతలు వేసి తమ ఇళ్లను ధ్వంసం చేస్తే సహించేది లేదంటూ నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పామర్రు - కత్తిపూడి 165 జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ముదినేపల్లిలోని అంబేద్కర్ కాలనీ వద్ద కంట్రాక్టర్ పొక్లెయిన్‌తో మంగళవారం రోడ్డును చదును చేసే పనులు ప్రారంభించాడు. రోడ్డు మార్జిన్‌లో ఉన్న అడ్డంకులను తొలగిస్తుండగా అక్కడకు చేరుకున్న నివాసితులు తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా పనులు ఎలా ప్రారంభిస్తారంటూ పనులు పర్యవేక్షిస్తున్న సిబ్బందిని ప్రశ్నించారు. రెండు రోజుల్లో మార్కింగ్ వేసిన వరకూ భూమిని ఖాళీ చేయాలని, లేకుంటే తామే ఇళ్లను పడగొడతామంటూ కంట్రాక్టు తరుపు సిబ్బంది తమపై దౌర్జన్యం చేస్తున్నారని నివాసితులు ఆరోపిస్తున్నారు. అధికారులు అంబేద్కర్‌కాలనీ వద్ద రోడ్డుకు ఒకవైపు మాత్రమే భూసేకరణ చేశారన్నారు. అంబేద్కర్ కాలనీ వద్ద రోడ్డు పొడవునా దక్షణం వైపు నాలుగు గజాలు ప్రభుత్వ భూమి ఉందని, దాన్ని కూడా తీసుకుంటే తమ ఇళ్లకు ఇబ్బంది ఉండదంటూ నివాసితులు చెబుతున్నారు. రోడ్డుకు ఒకవైపు మాత్రమే భూమి తీసుకోవడంతో తాము ఇళ్లను కోల్పోవాల్సి వస్తోందంటూ అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అప్పటికీ స్థలం చాలకపోతే తమ భూమికి నష్ట పరిహారం చెల్లించి లేదా, ప్రత్యామ్నాయం చూపించి భూమిని తీసుకోవాలే తప్ప అడ్డగోలుగా లాక్కుంటే దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని నివాసితులు హెచ్చరించారు. ఈ సందర్భంగా దళిత నాయకుడు, వైసిపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు నిమ్మగడ్డ భిక్షాలు మాట్లాడుతూ రోడ్డుకు దక్షణంవైపు రెండు గజాలు ప్రభుత్వ భూమి ఉందని, దాన్ని ప్రభుత్వం తీసుకుంటే నివాసితులు ఇళ్లకు ఇబ్బంది ఉండదన్నారు.

25 నాటికి జగనన్న ఇళ్లు పూర్తి

భీమడోలు:వచ్చేనెల 25వ తేదీ నాటికి జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నామని గృహనిర్మాణ సంస్థ భీమడోలు ఎఇ సతీష్ తెలిపారు. నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారుల వద్దకు స్థానిక గ్రామ కమిటీ సభ్యులువెళ్లి చైతన్య పరుస్తారన్నారు. ఈ తరహాలో మండల పరిధిలో 787 నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నట్టు గుర్తించామన్నారు. అలాగే నిర్మాణాలు ప్రారంభించి పూర్తిచేయని వారికి ప్రభుత్వపరంగా అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తారని తెలిపారు. ఈ రెండు విధానాల ద్వారా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూస్తామన్నారు.

నెలాఖరులోపు ప్రభుత్వ భవనాలు పూర్తిచేయాలి

భీమడోలు:మండల పరిధిలో ప్రాధాన్యత గల నిర్మాణాలను ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని ఎంపిడిఒ రాఘవన్ కోరారు. వివిధ పనుల ప్రగతిపై మంగళవారం ఆయన సమీక్షించారు. గృహ నిర్మాణాలు వేగవంతం చేసేందుకు లే అవుట్లకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. నాడు - నేడు పనులకు సిమెంటు, ఇసుక సత్వరం సరఫరా చేయాలని అధికారులకు సూచించారు.

పదో తరగతిలో ఉత్తమ విద్యార్థికి నగదు బహుమతి

చాట్రాయి:పోలవరం ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ఎల్.ఫణీంద్రకుమార్‌కు నగదు బహుమతి అందించి ఘనంగా సన్మానించారు. 600 మార్కులకు 543 మార్కులు సాధించడంతో ఎఫ్‌సిఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ కొండా విజయ్ రత్నరాజు రూ.పదివేల నగదుతో సత్కరించారు.

రైతు సంక్షేమానికి జగన్ కృషి

ప్రజాశక్తి - ముసునూరు

రైతు సంక్షేమానికి సిఎంఎ జగన్ కృషి చేస్తున్నారని వైస్‌ఎంపిపి, చెక్కపల్లి సొసైటీ అధ్యక్షులు కోటగిరి రాజా నాయన అన్నారు. మంగళవారం వలసపల్లి, లోపూడి గ్రామాల్లో దాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దాసరి సుధ, వైసిపి మండల అధ్యక్షులు నాగమల్లేశ్వరరావు, లోపూడి సర్పంచి పేరంకృష్ణ, వలసపల్లి సర్పంచి చలసాని దామోదర్ రావు పాల్గొన్నారు

వ్యవసాయ మోటార్లకు మీటర్లు వద్దు : సిపిఐ

ప్రజాశక్తి - ముసునూరు

వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు వద్దని, ఉచిత విద్యుత్ కొనసాగించాలంటూ సిపిఐ రాష్ట్ర నాయకులు వెంకట రామారావు అన్నారు. మంగళవారం స్థానిక సెంటర్‌లో రైతులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నూజివీడు డివిజన్ రైతులు బత్తుల వెంకటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా నాయకులు లక్ష్మణరావు, తుమ్మల లక్ష్మణరావు, ఒరుగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్ది ఒక్కరోజు ఆదాయం రూ.8.42 లక్షలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో 18 వేల మంది యాత్రికులకు అన్నదానం నిర్వహించామని ఆలయ కార్య నిర్వహణాధికారి ఎ.కొండలరావు తెలిపారు. మంగళవారం కార్తీక మాసోత్సవాల నేపథ్యంలో ఆలయానికి వేల సంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. ఈ క్రమంలో ఆలయానికి ఒక్కరోజు ఆదాయం రూ.8,42,488 సమకూరిందని తెలిపారు. ఆలయాన్ని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ సందర్శించారు.

ఎన్ఎస్‌డిసికి శ్రీ చైతన్య విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు మూడోసారి ఎన్ఎస్‌డిసి (నాసా స్పేస్ డైరెక్ట్ కాన్ఫరెన్స్)కు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు డి.సోనీ తెలిపారు. ఎంపికైన విద్యార్థుల అభినందన కార్యక్రమాన్ని పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శ్రీకృష్ణ ఫెర్టిలిటీ క్లినిక్ వైద్యులు రోషిణి నరేన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సోనీ మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరం ఎన్ఎస్‌డిసికి 18 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. డాక్టర్ రోషిణి మాట్లాడుతూ భీమడోలు పాఠశాల విద్యార్థులు వరుసగా మూడోసారి ఎంపిక కావటం అభినందనీయమన్నారు. శ్రీచైతన్య పాఠశాల సాంకేతికపరంగా విద్యార్థులను చైతన్యపర్చడం ద్వారా ఈ ఘనతను సాధించారన్నారు. అనంతరం పాఠశాలకు చెందిన చెందిన కౌమార బాలికలకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎన్ఎస్‌డిసి విభాగపు బాధ్యులు ఐశ్వర్య, అకాడమిక్ డీన్ రవి భార్గవ కిరణ్ పాల్గొన్నారు.

ముస్లిముల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

జంగారెడ్డిగూడెం:స్థానిక బిలాల్ మసీద్ కమిటీ ముస్లిముల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలిజా సూచించారు. మంగళవారం స్థానిక బిల్లాల్ మస్జీద్ నూతన కార్యవర్గ అధ్యక్షులుగా షేక్ జిలాని, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారానికి ఎంపీ, ఎంఎల్ఎ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైసిపి పోలవరం పరిశీలకులు మండవల్లి సోంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జీ, శిశు సంక్షేమ శాఖ రీజియన్ ఛైర్మన్ వందనపు సాయిబాబా పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఏలూరు బాలల గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శను రిటైర్డ్ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ రావి గోపాలకృష్ణ ప్రారంభించారు. అనంతరం పుస్తక ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థి దశ నుంచే పుస్తకాలను చదివే అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల పుస్తకాలతో పాటు గ్రంథాలయంలో లభించే అనేక రకాల విషయపరిజ్ఞానం ఉన్న పుస్తకాలను కూడా చదవడం విద్యార్థులు అలవాటు చేసుకోవాలన్నారు అనంతరం మాదకద్రవ్యాలు యువతపై ప్రభావం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఇటీవల కాలంలో యువత మాదకద్రవ్యాలకు బానిసై తమ భవిష్యత్‌ను పాడు చేసుకుంటున్నారని, అలాంటి చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చెన్న వెంకటరామయ్య, వివి.ప్రసాదరావు, ఎం.శోభ, గ్రంథాలయ నిర్వాహకురాలు కీర్తి, రికార్డ్ అసిస్టెంట్, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పుస్తక ప్రదర్శనలో అత్యధిక విద్యార్థులు పాల్గొని తిలకించారు. అనంతరం విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

గణపవరం : ప్రతిఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని స్థానిక హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.రాంబాబు అన్నారు. మంగళవారం గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వల్ల జ్ఞానం పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు సుభాషిని జి.సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమడోలు: మండలంలోని మూడు శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారమూ కొనసాగాయి. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు,- దుష్ఫరిమాణాలపై అవగాహన సదస్సు, పుస్తక పఠనం ప్రాముఖ్యత, వక్తృత్వ పోటీలు, పాఠశాల విద్యార్థులకు మ్యూజికల్ ఛైర్స్ పోటీలు నిర్వహించారు. అలాగే గుండుగొలనులో గ్రంథ పాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో, పూళ్లలో డిఎన్‌బి.అమర్‌నాథ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

ముదినేపల్లి : ముదినేపల్లి, గురజ శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ పి.మల్లేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇండోసాక్సన్ స్కూల్ ప్రిన్సిపల్ జార్జి, సుబ్బారావు, గ్రంథపాలకులు ఎం.శ్రీదేవి పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : కె.బొత్తప్పగూడెంలోని ఏకలవ్య బాలికల గురుకుల పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగాయి. జిల్లా సచివాలయాల శాఖ సామాజిక పరివర్తన మార్పు సమాచార విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా బాలల సంక్షేమ సమితి ఛైర్మన్ బి.రిబ్కారాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిసిసి జిల్లా కో ఆర్డినేటర్ టిఎన్.స్నేహన్, ప్రిన్సిపల్ సురేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, వెంకాయమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దెందులూరు : పోతునూరు శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మాదకద్రవ్యాల వినియోగం వల్ల నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోతునూరు సచివాలయ మహిళా పోలీసు బి.లక్ష్మీ, కె.సుస్మిత డ్రగ్స్ ప్రభావం మత్తుపదార్థాలు గురించి విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెచ్ఎం రూపవతి రంగయ్య, హై స్కూల్ టీచర్ బి.పద్మావతి ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జాన్‌బాబు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించాలని మహిళా పోలీస్ జిబిఎల్.కుమారి తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయ ప్రాంగణంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో ఆమె అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. స్థానిక విద్యా వికాస్, జోడన్, బాలికల హై స్కూల్, కిడ్స్ పాఠశాల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు.

రెండో రోజుకు గ్రంథాలయ వారోత్సవాలు

కలిదిండి : స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

చింతలపూడి : మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో మాదక ద్రవ్యాలవల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాయ ఛైర్మన్ మిర్యాల దిలీప్, ఎంపిపి రాంబాబు, ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.నీరజాసుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

చాట్రాయి : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చాట్రాయిలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.ప్రతాపరెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.సత్యనారాయణరెడ్డి, సైన్స్ అధ్యాపకులు చంటిబాబు, లైబ్రేరియన్ బడుగు మణికంఠ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎంఇఒ సురేష్ బాబు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు యు.రాముడు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మేకల అన్నవరం, సత్యనారాయణ పాల్గొన్నారు.

టి.నరసాపురం : పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందించుకోవచ్చని ఎంఇఒ టి.రామ్మూర్తి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకుడు ఆర్.కిషోర్, విజన్ ఇంగ్లీషు మీడియం స్కూల్ కరస్పాండెంట్ పురం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: పుస్తక పఠనం వల్ల ఏకాగ్రతతో పాటు, మానసిక ప్రశాంతతను పొందొచ్చని ఆగిరిపల్లి ఎంపిటిసి-2 సభ్యులు సాదం గోపీనాథ్ అన్నారు. ఆగిరిపల్లి శాఖాగ్రంథాలయంలో పుస్తక పఠనను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ అధికారి డి.నాగేశ్వరరావు, పాఠకులు పాల్గొన్నారు.

నిడమర్రు : స్థానిక శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాలకులు బాలరాజు, మీసాల మధుసూదనరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూజివీడు : గ్రంథం సమాజానికి దర్పణం వంటిదని స్థానిక ఎస్ఆర్ఆర్ బాలుర హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ భాగవతుల హేమలత అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు సిఐ మూర్తి మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో విద్యార్థులు, యువత సెల్‌ఫోన్ మాయాజాలంలో చిక్కుకోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాల యాధికారి శ్రీనివాసరావు, రిటైర్డ్ ఎండోమెంట్ ఇఒ చెందక రాజారామ్మోహనరావు పాల్గొన్నారు.

డాక్యుమెంటు పోయినది

కుసునూరి సూర్యనారాయణ, తండ్రి: కృష్ణమూర్తి, అను నేను తాడేపల్లిగూడెం బస్టాండ్ నుండి ఆటోలో వస్తుండగా మార్గమధ్యలో డాక్యుమెంటు నెం. 4300/2017 ఎస్.ఆర్. తాడేపల్లిగూడెం డాక్యుమెంటు పోయినది. కావున దొరికిన వారు ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు.

సెల్: 94947 25285

ప్రకటన

మహారాజశ్రీ కొవ్వూరు 9వ అడిషినల్ డిస్ట్రిక్ట్ జడ్జి వారి కోర్టులో

ఐ.ఎ.నెం.407/2021
ఐ.ఎ.నెం.408/2021
ఐ.ఎ.నెం.409/2021
ఓ.ఎస్.నెం.48/2012

బిట్వీన్:
మద్దిపాటి శరణా శ్రీదత్తా Being minor rep. by his mother & next friend మద్దిపాటి తులసీ వాణి
...పిటీషనర్ /వాది

VS

మద్దిపాటి అబ్బులు (డైడ్)
మద్దిపాటి పోసిబాబు వగైరాలు
...రెస్పాండెంట్లు /ప్రతివాద్లు

4వ రెస్పాండెంటు /ప్రతివాది:
కంతేటి జయలక్ష్మి, భర్త: గంగాధర్, వయసు 43 సం॥లు, స్త్రీ, హిందూ, జంగారెడ్డిగూడెం.

వాయిదా తేదీ: ది.21-11-2022

పై నెంబరు కేసులో మద్దపాటి అబ్బులు గారు చనిపోయినందున వారి వారసురాలు అయిన మీకు ఐ.ఎ.నెం.407/2021లో సెక్షన్ 5 పిటీషన్‌లో ఐ.ఎ.నెం.408/2021 Abatment Setaside పిటీషన్‌లోను మరియు ఐ.ఎ.409/2021 వారసులుగా చేర్పించమని దాఖలు చేసిన పిటీషనులో కోర్టు ద్వారా పోస్టు ద్వారా నోటీసులు తీసుకోకుండా Avoid చేయించునందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం పై నెంబరు దావాలో గల మూడు ఐ.ఎ.లలో పై కోర్టు వారి ఎదుట ది. **21-11-2022న ఉదయం గం॥ 10:30 ని॥ల లగాయితు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియ చేయగలరు.** లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

జె.వి.రమణ,
అడ్వకేట్, రౌండు పార్క్ వద్ద,
కొవ్వూరు. సెల్:

MUNICIPAL CORPORATION, ELURU

e-PROCUREMENT TENDER NOTICE No. 143-144/General/2022-23

Dated: 14-11-2022

The Commissioner, Municipal Corporation, Eluru, invites tenders from interested, eligible bidders for **"Providing RCC Culvert Slab to Jagananna Housing Colony and Providing New Bore Well at NTR Colony in Municipal Corporation, Eluru"** Total No's of works is 2 with an amount of **Rs.14.77 Lakhs.**

Tender schedules are available on e-procurement market place from 16-11-2022. Last date of receipt of tenders is 19-11-2022. Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner Municipal Corporation, Eluru, Eluru District (Phone / Fax : 08812 - 245990)

Sd/- **COMMISSIONER,** Municipal Corporation, Eluru

పాస్‌పోర్టు పోయినది

VELLANKI VENKATA DURGA PRASAD అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.20-07-2012న **K6572533** నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్సు కాపీలు తీయించుకునేందుకు నరసాపురం పట్టణం మెయిన్‌రోడ్డుకు వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన ఎవరికైనా నా పాస్‌పోర్టు దొరికినచో ఈ క్రింది చిరునామాకు అందచేయగలరని కోరుతున్నాను.

VELLANKI VENKATA DURGA PRASAD,
S/o. Vellanki Ranga Rao,
D.No. 15-3-129, NTR Colony,
Roypeta, Narasapur - 534275,
W.G.Dist., A.P

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, నాచుగుంట పంచాయితీ కొత్తగూడెం కాపురస్తురాలైన మెడంకుల రమణ, భర్త: శ్రీను అను నాకు గల **పాస్‌పోర్టు నెం. X0939637** గత నెల 28-10-2022వ తేదీన ఉంగుటూరు నుండి తాడేపల్లిగూడెం ఆటోలో వెళుతుండగా పాస్‌పోర్టు కలిగి ఉన్న కవర్ మార్గమధ్యలో పడిపోయింది. కావున దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

మెడంకుల రమణ
భర్త: శ్రీను, డో.నెం. 13-263,
కొత్తగూడెం, ఉంగుటూరు మండలం,
ఏలూరు జిల్లా - 534411
సెల్ నెం.: 73823 32699

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, గణపవరం మండలం, మొయ్యేరు గ్రామ కాపురస్తులయిన తాడి కుమారి, భర్త: రాజా రమేష్ అను నేను నాయొక్క పాస్‌పోర్టు మొయ్యేరు నుండి పిప్పర వెళ్ళే దారిలో మార్గమధ్యలో **పాస్‌పోర్టు నెం. G0613083** పాస్‌పోర్టు ఉన్న కవరు పడిపోయినది. కావున పాస్‌పోర్టు దొరికిన వారు ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు.

తాడి కుమారి
భర్త: రాజా రమేష్, మొయ్యేరు,
గణపవరం మండలం, ఏలూరు జిల్లా.
సెల్ నెం.
63013 92787, 93463 49033

PUBLIC NOTICE

IN THE COURT OF THE HON'BLE II ND ADDL. DIST. COURT : DR.B.R.AMBEDKAR KONASEEMA DIST : AMALAPURAM

A.S.No. 8 of 2021

Between:
Nela Kattari & others ***...Appellants***
VS
Ganti Srinivasa Rao & Others ***...Respondents***

2ND RESPONDENT:
Penmatsa Venkata Durga Varaprasad Varma, S/o. Appalanarasimha Raju, D.No. 7/3, Bhimavaram Village & Mandal, W.G.Dt.

The above named appellants has instituted the above appeal, against you, and the same stands posted to **09-12-2022 at 10:30 A.M.** for your appearance, you are hereby required to appear personally or through advocate attend before this Hon'ble court at 10:30 A.M. and file your objections if any. failing which the matter will be heard and determined in your absence exparte as per Law.

//By the orders of the Hon'bel court//

D.V.V.S.MURTHY
Amalapuram, Advocate, Amalapuram
15-11-2022. Cell: 98483 44577

NOTICE

IN THE COURT OF THE HON'BLE III ADDL.DIST. JUDGE:: GUNTUR

A.S No: 93 / 2019

Between:
Vetra Radha Krishna Reddy …. Appellant
And
Majeti Rajani and Others … Respondents

To.
R-1: Majeti Rajani, D/o.Chandra Sekhar, R/o.Door No:4-8-2/A, Power Pet of Gunturu vari Street, Eluru West,West Godavari Dt.
R-4: N.N.Swamy, S/o.Not Clearly Known, R/o.House No: 4-15-/5/A/2, Opp.Rama Building, Amaravathi Road, Guntur.

పై నెంబరు అప్పీలులో R-1 & R-4 అయిన మీకు పై కోర్టు వారి ద్వారా నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు నోటీసును ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది: 15-12-2022 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేక మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకోగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 15-12-2022

కోటంరాజు శేష చంద్ర మౌళీశ్వర రావు,
అప్పీలెంట్ తరపు అడ్వకేట్,
లాలుపురం రోడ్, గుంటూరు.

మహారాజశ్రీ అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి ఏలూరు వారి కోర్టుల్లో, ఏలూరు జిల్లా

O.S. 299/2015

బిట్వీన్:
శ్రీ సింగోతు సత్య రవిచంద్ర @ సత్య మరియు ఒకరు
...వాదులు

AND

శ్రీ సింగోతు దివాకర్ (డైడ్) మరియు వగైరా
...ప్రతివాదులు

పై నెంబరు దావాలో ప్రతివాదులు అయిన **D2:** శ్రీమతి సింగోతు నిర్మల, భర్త: లేటు దివాకర్, R/o. డో.నెం. 24-2-1, శశి టెక్నో స్కూలు వద్ద, ఆర్.ఆర్.పేట, ఏలూరు, **D3:** శ్రీ సింగోతు జయకర్, తండ్రి: లేటు దివాకర్, R/o. డో.నెం. 24-2-1, శశి టెక్నో స్కూలు వద్ద, ఆర్.ఆర్.పేట, ఏలూరు, **D4:** శ్రీ సింగోతు మధుకర్, తండ్రి: లేటు దివాకర్, R/o. డో.నెం. 24-2-1, శశి టెక్నో స్కూలు వద్ద, ఆర్.ఆర్.పేట, ఏలూరు, **D5:** శ్రీమతి సింగోతు దీప్తి, తండ్రి: లేటు దివాకర్, R/o. డో.నెం. 24-2-1, శశి టెక్నో స్కూలు వద్ద, ఆర్.ఆర్.పేట, ఏలూరు అను వారికి సమన్లు అమలు కొరకు **ది.15-12-2022కి వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదా రోజున పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలు తెలుపుకోవలెను.** లేని ఎడల వారి పరోక్షమందు దావా సంగతులు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఇ.శ్రీనివాసబాబు
అడ్వకేట్, అమీనా పేట,
ఏలూరు. ఫోన్: 08812 239498